జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట









# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

- ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై అధికారులకు సూచనలు






## టన్ను ధర రూ. 23,852



ఓ వైపు ప్రకృతి, మరో వైపు దళారుల ధరలు రైతులను నట్టేట ముంచుతున్న సమయంలో తాను ఆదుకుంటానంటూ ఆయిల్‌పామ్ పంట తెరపైకి వచ్చింది. జిల్లాలో దశల వారీగా సాగుచేస్తున్న రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. మొదట్లో 2వేల ఎకరాల సాగు నుంచి ప్రస్తుతం 6వేల500 ఎకరాలకు పెరిగింది. గతంలో మెట్రిక్ టన్నుల ఆయిల్ పామ్ రూ.18వేల ధర ఉండగా, ప్రస్తుతం రూ.23వేల 852 పెరి గింది. దీంతో ఆయిల్‌పామ్ రైతులు సంబురపడుతున్నారు.

రూ.3 కోట్ల మేరకు అమ్మకాలు.. నాలుగేళ్లుగా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ దిగుబడులు రైతులకు పెద్ద ఎత్తున చేతికి వస్తున్నాయి. ఎలాంటి చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం లేకపోవడంతో దిగుబడులు ఇబ్బడి ముబ్బడిగా వస్తున్నాయి. ఇప్పటి వరకు రూ.3కోట్ల విలువైన పంటను రైతులు విక్రయించినట్లు అధికారులు తెలుపుతున్నారు. దీనికి సంబంధించిన డబ్బులు సైతం రైతుల ఖాతాల్లో పడ్డాయి.

జిల్లాలో ప్రతీ వానా కాలం, యాసంగిలో రైతులు ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల భూమి సారం కోల్పోవడమే కాకుడా ఎక్కువగా పంట పండటం వల్ల సరైన ధర రాక రైతు లు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక నుంచి పంట మార్పిడిని తప్పనిసరిగా పాటించాలంటూ ప్రభుత్వం సూచనిలిస్తోంది. సంప్రదాయ పంటలకు భిన్నంగా మంచి ధర ఉండటం, కంపెనీ బాయ్ బ్యాక్, సాగులో ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో ఆయిల్‌పామ్ వైపే రైతులు మొగ్గుచూపు తున్నారు.

నెల నెలా ఆదాయం..

వ్యవసాయంలో ఏ పంటకు లేని విధంగా ఆయిల్‌పామ్ పంట పెట్టుకున్న రైతులకు నెలనెలా ఆదాయం వస్తుంది. రెండు ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట పెట్టుకున్న రైతు సరైన సాగు మెలకువలు 3 సంవత్సరాల వరకు పాటిస్తే 36 నెలల తరువాత మొదటి కోత మొదలవుతుంది. అలా ప్రతీ 25 రోజుల కొకసారి గెలలు కోయవచ్చు. కోసిన ప్రతీసారి ఆ నెల టన్ను ధర ప్రకారంగా రైతు ఖాతాలో డబ్బులు జయచేయబడతాయి.

# డగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

-చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం.
-వ్యసనాలకు బానిస అయితే భవిష్యత్తు అంధకారమే.
- బంగారు భవిష్యత్తు కోసం యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.
-జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్.



# జాజాపూర్ లో మొహరం వేడుకల్లో పోటెత్తిన భక్తులు

కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక



# డగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

నారాయణపేట ప్రతినిధి జూన్ 26 (ప్రజా జ్యోతి)





డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని, యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలని జిల్లా కలెక్టర్ జ౦ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, ఎస్పీ డా వినీత్ లు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా అందరూ కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తోటి వారూ ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య దశలో బంగారు భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఫ్రెండ్స్ , ఎంజాయ్ అంటూ ఇప్పుడు తిరిగితే మన సమయం బాగా లేనప్పుడు మనకు తోడుగా ఎవ్వరూ రారని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. మిమ్మల్ని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వాళ్ళు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... స్టేట్ ఈగల్ ఫోర్స్ టీం డ్రగ్స్ పై దాడులు నిర్వహిస్తున్నాయని, ప్రజలు యువత వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.

డ్రగ్స్ అనేవి ఒక విధంగా టెర్రరిస్ట్‌లాంటివని, ఇవి దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు. యువత ఎక్కువగా ఉన్న భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు అవసరం లేదని, ఆ దేశ యువతను చెడు మార్గంలోకి నెట్టేస్తే చాలు అని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని, అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ అనేది జాతీయ భద్రత కు భంగం కలిగించేలా చేస్తుందని, అందువల్ల విద్యార్థులు, యువత ఈ చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచుతూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే జీవితాంతం దాని ప్రభావం ఉండే ప్రమాదం ఉందని, అందువల్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులుగా మారాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్, ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గాయత్రి, కృష్ణ చైతన్య, ఎక్సైజ్ ఎస్ఐ లు,మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ రిజర్వేషన్ల ద్వారానే గిరిజన అభివృద్ధి

**పంచశీల సూత్రాల వల్ల గిరిజనులకు విముక్తి**

**సెప్టెంబరు 18న ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ**

**గిరిజనకాంగ్రెస్ ఎంపీ ఎమ్మెల్యేలు**

**నాగర్ కర్నూల్ జూన్ 26**

బంజారాలను అందరినీ ఏకం చేసేందుకు ఇందిరాగాంధీ కృతజ్ఞతయాత్ర చేస్తున్నామని కాంగ్రెస్ ఎస్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు. రిజర్వేషన్ల స్వర్ణోత్సవ యాత్ర సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో చేపట్టిన యాత్ర నాగర్‌కర్నూల్ చేరుకుంది. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ మాట్లాడుతూఎస్టీలకు రిజర్వేషన్లు వచ్చి 50 సంవత్సరాలు అవుతున్నాయన్నారు. ఈ ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వల్లే సాధ్యం అయ్యిందన్నారు.ఇందిరా, రాజీవ్‌గాంధీ త్యాగాలతోనే ఎస్టీల అభివృద్ధి జరిగింది అన్నారుచరిత్రను ఎవరూ మార్చలేరన్నారు.గ్రామాలతో పోటీ పడేలా తండాలను అభివృద్ధి పర్చేలా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రిజర్వేషన్లు వచ్చి 50 ఏండ్లు కావస్తున్న సందర్భంగాఇందిరాగాంధీకి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నామని, అందులో భాగంగాసెప్టెంబరు 18న ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ కేసీఆర్ నలుగురు బంజారా బిడ్డలు ప్రాణాలు కోల్పోయిన ఏమీ చేయలేదన్నారు. మళ్లీఆదివాసీ, బంజారా జాతుల మధ్య చిచ్చుపెట్టారని విమర్శించారు. అలాగేజీఓ 3 రద్దు చేసి ఉద్యోగాలు కోల్పోయేలా కుట్రలు చేశారన్నారు.గతంలో 86వేల కోట్ల రుణమాఫీ కాంగ్రెస్ చేసిందన్నారు. రాష్ట్రంలో ఎస్టీలు అందరూ ఇందిరా గాంధీకి కృతజ్ఞతలు చెప్పుకోవాలని, బీఆర్ఎస్, ఇతర పార్టీల భ్రమలో పడకూడదన్నారు. ఎల్బీ స్టేడియంలో సభకు లక్షలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.అన్ని గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. రవీంద్ర నాయక్ మాట్లాడుతూ కేసీఆర్ ఎస్టీల మధ్య విభేదాలు సృష్టించారని అన్నారు.40వేల కోట్ల డబ్బులు దారి మళ్లించారని, సత్యవతి రాథోడ్, కవితలు కేసీఆర్ ని ఏనాడూ ప్రశ్నించలేదన్నారు. 7వేల కోట్ల వడ్డీ కట్టడానికి కేసీఆర్ కారణం అన్నారు.సత్యవతి ముందు చెప్పులు తొడుక్కోవాలన్నారు. సేవాలాల్ తో కేసీఆర్ ను పోల్చవద్దన్నారు. గిరిజన ప్రాంతాలు పోయినా జీఓ 3పై సంతకం పెట్టారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రాందాస్ నాయక్, బాలునాయక్, మురళినాయక్,

జిల్లా ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రాజేష్ రెడ్డి, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎంఎల్సీ రాములు నాయక్ పాల్గొన్నారు.



# జాజాపూర్ లో మొహరం వేడుకల్లో పోటెత్తిన భక్తులు

నారాయణపేట ప్రతినిధి జూన్ 26 (ప్రజా జ్యోతి)

నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలో మొహరం మహోత్సవాలు శుక్రవారం నవమి సవారి మౌలాలి సవారి సందర్భంగా అత్యంత వైభవంగా కొనసాగాయి. మౌలాలి సవారి తో పాటు వివిధ పీర్ల ఉత్సవాల్లో పాల్గొనేందుకు తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు జాజాపూర్ కు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నారాయణపేట మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించే మొహరం వేడుకలకు జాజాపూర్ పీర్ల ఉత్సవాలు ప్రత్యేక గుర్తింపు పొందింది.నవమి సవారి సందర్భంగా పీర్ల ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. ఊరేగింపు మార్గమంతా భక్తులు నీటితో రహదారులను శుభ్రపరచి పీర్లకు దట్టీలు, పూలమాలలు, చాదర్లు సమర్పించి బుక్క వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. హిందూ--ముస్లిం సోదరభావానికి ప్రతీకగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు వేడుకల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ వేడుకల్లో గ్రామంలో చిన్నపిల్లల వస్తువుల దుకాణాలు మిఠాయి దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి.మొహరం వేడుకలను తిలకించేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పీర్ల వద్ద కందూర్లు చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సతీష్ రెడ్డి తోపాటు పోలీసులు, గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ సంగీత, కుమ్మరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కొనసాగింది.



# ఇందిరమ్మ రాజ్యంలో గిరిజన అభివృద్ధికి పెద్దపీట

**- ప్రతి గిరిజన ఆవాసంలో సేవాలాల్ ఆలయాల నిర్మాణం చేపడతాం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**- ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపు**

**వనపర్తి, జూన్ 26 (ప్రజాజ్యోతి):**

ఇందిరా గాంధీ హయాం నుంచి నేటి వరకు గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 'ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ వేడుకల' బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 1976లోనే గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పునాది వేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి గిరిజన ఆవాస ప్రాంతంలో సేవాలాల్ ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం,



రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని వివరించారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకోనున్న ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సు యాత్రను విజయవంతం చేయాలని గిరిజన సోదరులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం గిరిజన నాయకులతో కలిసి బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గిరిజన సంఘాల నాయకులు, యువకులు, , కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడలు, ఉన్నత విద్యతో యువత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**- స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన యువకులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి సన్మానం**

వనపర్తి, జూన్ 26 (ప్రజాజ్యోతి): హాకీ క్రీడలో ప్రతిభ కనబర్చి స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు సాధించిన వనపర్తి నియోజకవర్గానికి చెందిన యువకులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం సత్కరించి అభినందించారు. వనపర్తిలోని నంది హిల్స్‌లో ఉన్న తన నివాస కార్యాలయంలో వారికి శాలువాలు కప్పి సన్మానించారు. గుండ్యావాల నాయక్ తండాకు చెందిన దివాకర్ భారత వైమానిక దళం (ఎయిర్‌ఫోర్స్), ముందరితండాకు చెందిన అర్జున్ టెండూల్కర్ అగ్నివీర్, గట్లఖానాపురం తండాకు చెందిన ఎం. భాస్కర్ టెరిటోరియల్ ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడల్లో ప్రతిభతో చిన్న వయసులోనే ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. యువత ఉన్నత విద్యతో పాటు క్రీడలపైనా దృష్టి సారించి జీవితంలో ఉన్నత శిఖరాలు



అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, కౌన్సిలర్ ధనలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం యాదవ్, ప్రధాన కార్యదర్శి బోలెమోని కుమార్, సభ్యులు రామ్మోహన్, నిరంజన్ గౌడ్, స్వామి, వహీద్, ప్రశాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

**- ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై అధికారులకు సూచనలు**

**మహబూబ్‌నగర్, జూన్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్--2026)లో భాగంగా జిల్లాలో ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం పరిశీలించారు.భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామం, దేవరకద్ర మండలం దేవరకద్ర గ్రామం, కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామం, చిన్నచింతకుంట మండలం చిన్నచింతకుంట గ్రామం, అడ్డాకల్ మండలం అడ్డాకల్ గ్రామం, మూసాపేట్ మండలం కోమిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించిన అదనపు కలెక్టర్ ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల తహసీల్దార్లు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశమై ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిబంధనల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన కవిత మధుసూదన్ రెడ్డి

**- లబ్ధిదారులకు నూతన వస్త్రాల పంపిణీ**




**అడ్డాకుల, జూన్ 26 ( ప్రజా జ్యోతి ) :**

దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం రాచాల గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహప్రవేశం చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను అభినందించిన ఆమె, తమ కుటుంబం తరఫున నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ సొంత ఇంటి కల సాకారమవుతుండడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విజయ్ మోహన్ రెడ్డి, మేఘనాథ్, రవి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**- యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర నాయకులు ఎండి సయ్యద్**




**నాగర్ కర్నూల్ జూన్ 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

అచ్చంపేట పట్టణ కేంద్రంలోని వసతి గృహాల్లో తనిఖీలో భాగంగా యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తనిఖీలు చేయడం జరిగింది ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఉండే సయ్యద్ మాట్లాడుతూ పాఠశాలలో తెరుచుకొని నాటికి పది రోజులు దాటుతున్న ఈనాటికి కూడా వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించలేదు మరియు పుస్తకాలు పంపిణీ కాలేదు విద్యార్థులకు హాస్టల్లో తక్షణమే పుస్తకాల పంపిణీ చేయాలి అదేవిధంగా మౌలిక వసతులు కల్పించాలి విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని రాష్ట్ర నాయకులు ఎండి సయ్యద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పది రోజులు గడుస్తున్న పాఠ్యపుస్తకాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు కాబట్టి వెంటనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని వారు డిమాండ్ చేశారు లేనియెడల విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు, శివ , రాజు, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే సమక్షంలో... గౌరీ శంకర్ జన్మదిన వేడుకలు

**నాగర్ కర్నూల్ జూన్ 26 ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలోని క్యాంప్ కార్యాలయం లో శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో మాజీ కౌన్సిలర్ గౌరీ శంకర్ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ కేక్ కట్ చేసి, శాలువా కప్పి, కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మార్కెట్ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, అధ్యక్షుడు ఎస్ కే ఖాదర్బాషా కాంగ్రెస్ శ్రేణులు గౌరీ శంకర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ కి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని.. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని వారు పేర్కొన్నారు. జన్మదినోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భీమా వర్తింపు హర్షనీయం

**నాగర్ కర్నూల్ : జూన్ 26 (ప్రజా జ్యోతి)**



ఔట్సోర్సింగ్ ఉంద్యోగులకు 60 లక్షల బీమా వర్తింపు హర్షణీయమని జిల్లా అధ్యక్షులు శ్రీనివాస చార్యులు,జిల్లా ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ వర్మ లు అన్నారు.జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలో కార్పొరేషన్లు సొసైటీలు స్థానిక సంస్థలలో వేలాదిమంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నవారికి కూడా 60 లక్షల వరకు బీమా రక్షణ కల్పించడం ఉద్యోగుల కుటుంబాలకు గొప్ప భరోసా కలిగిస్తుందని వారు పేర్కొన్నారు.గతంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషించినప్పటికీ అనేక సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరంగా ఉండేవారని ప్రస్తుత ప్రభుత్వం వారికి కూడా బీమా పథకం పరిధిలోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. అలాగే ఏజెన్సీ వ్యవస్థను తీసివేసి కార్పొరేషన్ లేదా ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని ఈ పథకం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రికి,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మరియు మంత్రి వర్గానికి, అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

# వీపనగండ్లకు భారీ వరం.

-నూతన తహసిల్దార్ కార్యాలయానికి రూ.2.25కోట్లు

-అంగన్వాడి భవనాలకు అదనపు నిధులు.

-మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో మంజూరు

- కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు హర్షం.



వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. మండల అభివృద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది మండల కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రెండు కోట్ల 25 లక్షల రూపాయలు మంజూరు చేయడంతో పాటు రంగవరం వల్లభాపురం తాండ గోవర్ధనగిరి బొల్లారం గ్రామాలలో అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఒక్కొక్క కేంద్రానికి 12 లక్షల రూపాయల చొప్పున నిధులు కేటాయించినట్లు నాగర్ కర్నూలు జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వాల నరసింహ అన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవతోనే ఈ నిధులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు ఈ నిధులతో మండలంలో ప్రభుత్వ సేవలు మరింత మెరుగు పడటంతో పాటు చిన్నారులకు మెరుగైన అంగన్వాడి వసతులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు నిధులు మంజూరుకు విశేష కృషి చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు మండల ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వీపున అభివృద్ధికి కొత్త ఊపు నిస్తుందని వారు అభిప్రాయపడ్డారు

## సంగమేశ్వరంలో ఉన్న వేప మొద్దు లింగమయ్యను దర్శించుకున్న జిల్లా కలెక్టర్

కొల్లాపూర్ జూన్ 26 ప్రజా జ్యోతి

సంగమేశ్వరం దగ్గర సప్త నదులు కలిసే సంగమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ దంపతులు. ఆలయ అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించి పురాణ వేదంతాలు ఆలయము గురించి అడిగి తెలుసుకున్నారు. మహాభారతంలో పాండవులు ఒక్క సంవత్సరం అజ్ఞాత వనవాసం చేయడానికి ఇక్కడికి వచ్చారని పురాణాలు చెబుతున్నాయి, అప్పుడు ఇక్కడ పూజలు నిర్వహించాలని పాండవులు నిర్ణయించుకొని పూజ కార్యక్రమం జరపడానికి నిర్ణయించారు. అందులో భాగంగా భీముని కాశీకి పోయే లింగాన్ని తీసుకొని రమ్మని ధర్మరాజుడు అనగా కాశీకి వెళ్లిన భీముడు లింగాన్ని లేటుగా తీసుకువచ్చారు. అప్పటికే అక్కడ పూజలు జరిగాయి, పూజ సమయానికి భీముడు లింగాన్ని తేలేదు అని అన్న ధర్మరాజు అక్కడే ఉన్న వేప చెట్టును నరికి నా మొద్దును లింగముగా చేసి పూజలు జరిపారు అని పురాణాలు చెబుతున్నాయి. ఇది సంగమేశ్వరం ఆలయ పురాణం ఇక్కడ ఉన్న సప్త నదులకు సంగమేశ్వరానికి చరిత్ర ఉన్నదని ఆలయ అర్చకులు వివరించారు.సంగమేశ్వరం లో లింగానికి సంగమేశ్వరునికి ప్రత్యేక పూజాలు చేసిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ దంపతులు.కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వాల నరసింహ, కొల్లాపూర్ ఎమ్మార్వో మాధవి , సోమశిల గ్రామ సర్పంచ్ కాటం వెంకటలక్ష్మి , గ్రామ జిపిఓ కురుమయ్య పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణనదిలో కొలువైన సంగమేశ్వర ఆలయంలోని సంగమేశ్వరుడిని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ దంపతులు శుక్రవారం రోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలు



నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ పూజారులు కలెక్టర్ దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి సంగమేశ్వరం ఆలయ పురాణాన్ని తెలియజేసారు.

# ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి

- ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని బీఎల్ఓలకు ఆదేశం

మహబూబ్నగర్, జూన్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్--2026)లో భాగంగా ఇంటింటా గణన, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, సూపర్వైజర్లతో వెబ్ఎక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బీఎల్ఓలు ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఎన్యూమరేషన్






ఫారాలను అందజేయాలని సూచించారు. ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా సేకరించి, నిర్ణీత గడువులోగా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయాలని, అధికారులు పరస్పర సమన్వయంతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్డీవో నవీన్తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- విద్యార్థులతో మమేకమై హాస్టల్ సౌకర్యాలపై ఆరా

మహబూబ్నగర్, జూన్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :



దేవరకద్రలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలోని వంటగది, హాస్టల్ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన ఆహార తయారీ నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు.అనంతరం హాస్టల్లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి, ఆహారం, పారిశుధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో అందుతున్న సౌకర్యాలకు సంబంధించిన తమ అనుభవాలను విద్యార్థులు అదనపు కలెక్టర్కు వివరించారు. విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత




చిన్నంబావి జూన్ 25 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదక ద్రావ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ చిన్నంబావి మండల ఎస్సై రామన్ గౌడు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు వివేకానంద స్కూల్ నుండి ప్రారంభమై చిన్నంబావి చౌరస్తా వరకు వివేకానంద విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై రామన్ గౌడ్ మాట్లాడుతూ. డ్రగ్స్ వల్లన దుష్ప్రరిణామాలు వ్యక్తి గత జీవితం కుటుంబం మరియు సమాజం పై వాటి ప్రభావం గురించి విద్యార్థులకు వివరించి వారికి అవగాహనా కల్పించారు. డ్రగ్స్ వ్య సేనం యువత ను నేరాలు, హింస, మానసిక వత్తిడి ఆరోగ్య సమస్యల వైపు నడిపిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి నా కళలు నా భవిష్యత్ అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కేవలం పోలీసుల మాత్రమే కాదు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధుల అందరు కలిసి పని చేసినపుడే ఈ సమాజిక సమస్య పూర్తి గా నిర్మూలించగలమని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగస్వామి,పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు పార్వతి మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెండోసారి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తోట శ్రీహరికి ఎమ్మెల్యే సన్మానం

అడ్డాకుల, జూన్ 26 ( ప్రజా జ్యోతి ) :

దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన తోట శ్రీహరిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. రెండోసారి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన తోట శ్రీహరికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువా కప్పి సత్కరించారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.



# ఘనంగా మొహరం వేడుకలు

## -కులమతాలకు అతీతంగా పాల్గొన్న భక్తులు

## -సోదరాభావనికి ప్రతీక మొహరం





**నాగర్ కర్నూల్ : జూన్ 26 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో శుక్రవారం మొహరంవేడుకలు అత్యంత వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఉత్సవాల్లో పాల్గొనేందుకు జీవన ఉపాధి కోసం పట్టణాలలో నివాసం ఉంటున్న గ్రామస్తులు తెల్లవారుజాము నుంచే తమ సొంత గ్రామాలకు తరలివచ్చి మొక్కు చెల్లించుకున్నారు. అత్యంత వైభవంగా నిర్వహించే ఈ మొహరం వేడుకల సందర్భంగా ప్రత్యేక గుర్తింపు పొందిన గ్రామాలలో పీర్ల ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. ఊరేగింపు మార్గాలలో భక్తులు నీటితో రహదారులను శుభ్రపరచి పీర్లకు దట్టీలు,పూల మాలలు,చాదర్లు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. హిందూ--ముస్లిం సోదరభావానికి ప్రతీకగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు వేడుకల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. పీర్ల వద్ద కందూర్లు,ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు,గ్రామ సర్పంచులు,ఉప సర్పంచు ఆధ్వర్యంలో మొహరం వేడుకలు జరిగాయి.

# పీర్ల ఉత్సవాలు నేడు ముగింపు

## -కులమతాలకు అతీతంగా పీర్ల ఊరేగింపులు

## - ఐక్యతకు ప్రతీకగా మొహరం





**చిన్నంబావి, జూన్ 26: (ప్రజాజ్యోతి)**
చిన్నంబావి మండలంలోని గూడెం, పెద్దమారూర్, చెల్లెపాడు, చిన్నమారూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పీర్ల ఊరేగింపులు, సంప్రదాయ ఆటపాటలు, ప్రత్యేక ప్రార్థనలతో గ్రామాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మసీదులు, దర్గాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు, యువత, గ్రామ పెద్దలు పీర్ల ఊరేగింపుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామాలన్నీ భక్తి, సామరస్య వాతావరణంతో కళకళలాడాయి. మొహరం పండుగను కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి సంవత్సరం అందరూ కలిసి జరుపుకోవడం విశేషమని, ఈ పండుగ సామాజిక ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ముగిసిన మొహర్రం వేడుకలు

## హిందూ, ముస్లింల ఐక్యతకు నిలువెత్తు నిదర్శనం






**చిన్నంబావి, జూన్ 26 (ప్రజా జ్యోతి)**
కుల, మతాలకు అతీతంగా గ్రామ ప్రజలను ఒక్కచోట చేర్చి సోదరభావాన్ని పెంపొందించే పీర్ల పండుగ మరోసారి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ గ్రామంలో శుక్రవారం మొహర్రం సందర్భంగా పీర్ల పండుగను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు మొక్కులు చెల్లించుకొని తమ కుటుంబాల సుఖసంతోషాలు, గ్రామ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లింలు కలిసి నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. మహిళలు బొడ్డెమ్మలతో, యువకులు “అలై-బలై” నృత్యాలతో ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం పీర్ల నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు నిష్ఠతో అగ్నిగుండం తొక్కి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. మొహర్రం చారిత్రక నేపథ్యం ఇస్లామిక్ నూతన సంవత్సరం తొలి నెల అయిన మొహర్రం, కేవలం పండుగ మాత్రమే కాదు. సత్యం, ధర్మం కోసం ప్రాణత్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్ మరియు ఆయన అనుచరుల అమర గాథను స్మరించుకునే పవిత్ర కాలం. శతాబ్దాల క్రితం ఇరాక్‌లోని కర్బలా మైదానంలో అధర్మ పాలనకు వ్యతిరేకంగా కేవలం 72 మంది అనుచరులతో పోరాడిన ఇమామ్ హుస్సేన్, మొహర్రం 10వ రోజు (ఆషూరా)అమరుడయ్యారు. ఆయన త్యాగం నేటికీ ధర్మానికి ప్రతీకగా నిలిచింది. తెలుగు రాష్ట్రాల్లో పీర్ల పండుగ ప్రత్యేకతతెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొహర్రాన్ని “పీర్ల పండుగ”గా జరుపుకోవడం విశేషం. కుల, మత భేదాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు కలిసి పీర్ల చావిడిల వద్ద పూజలు నిర్వహించడం, మొక్కులు చెల్లించడం, అగ్నిగుండం తొక్కడం వంటి సంప్రదాయాలు గంగా-జమునా సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. మొహర్రం ఇచ్చే సందేశం”అన్యాయం ముందు తలవంచకూడదు... సత్యం కోసం చివరివరకు నిలబడాలి” అనే గొప్ప సందేశాన్ని మొహర్రం ప్రపంచానికి అందిస్తుంది. నేటి సమాజంలో విలువలు, మానవత్వం, నైతికతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ పండుగ గుర్తు చేస్తుంది. ఉపవాసాలు, దానధర్మాలు మానవత్వాన్ని పెంపొందిస్తే, పీర్ల పండుగ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే లౌకిక భారతదేశ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, వారు చూపిన ధర్మమార్గంలో నడవడమే వారికి మనం అందించే నిజమైన నివాళి.

# మల్లేశ్వరంలో అంగరంగ వైభవంగా మొహరం పండుగ

**కొల్లాపూర్ జూన్ 26 ప్రజా జ్యోతి**
కొల్లాపూర్ నియోజక వర్గం పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామంలో 9 రోజులు మోహరం పండగ ను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులు భక్తి దీక్ష నియమాలతో సవారి ఎత్తే వాళ్లు పానకం బుడ్డితో భక్తి శ్రద్ధతో 9 రోజులు దీక్షతో సవారిని మోస్తారు, అలాయి చుట్టూ భక్తులు అలాయి తొక్కుతూ బొడ్డెమ్మలతో సవారుల దగ్గర 9 రోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. చివరి రోజున భక్తులు పి ర్లను ఎత్తుకొని గోకరమ్మ దగ్గరికి పోయి తిరిగి కృష్ణా నదిలో నిమగ్నం చేస్తారు. ఈ ఆచారం ఆనవాయిద్యం ప్రకారం తాతలు ముత్తాతల నుంచి వస్తూనే ఉంది భక్తుల కోరికలు తీర్చే అల్లా బాస్ విమన కాసిం పేర్లకు భక్తులు ముడుపులు దట్టీలు కొబ్బెర కుడుకలు బెల్లం పప్పులు బుక్క దండలు బొరుగులతో అలంకరించి భక్తుల మొక్కుబడులు తీర్చుకుంటారు.



# కులమతాలకు అతీతంగా ఘనంగా మొహరం పండుగ వేడుకలు.

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్
మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో మొహరం పండుగను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు అన్ని వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో పాల్గొని పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు మండలంలోని అన్ని గ్రామాలలో మొహరం ఊరేగింపులు వైభవంగా సాగగా ప్రజల భాగ్య స్వామితో పండగ సందడి జరిగింది ఈ సందర్భంగా సామరస్యం సోదర భావంతో ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించడంతో ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొన్నది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టిదిట్టమైన ఏర్పాటు చేశామని స్థానిక ఎస్సై జె నరేష్ అన్నారు
13



# సామాజిక న్యాయానికి ఆదర్శప్రాయుడు ఛత్రపతి సాహు మహారాజ్

## - 152వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**జడ్చర్ల, జూన్ 26 (ప్రజా జ్యోతి ):**

సామాజిక న్యాయం, సమానత్వం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఛత్రపతి సాహు మహారాజ్ అని బీసీ జాగృతి సేన నాయకులు కొనియాడారు. ఆయన 152వ జయంతి సందర్భంగా శుక్రవారం జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సీ) ఆవరణలో ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్, రజక సంఘం జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్హాపూర్ సంస్థానాన్ని సామాజిక న్యాయానికి ఆదర్శంగా తీర్చిదిద్దిన గొప్ప సంఘ సంస్కర్త ఛత్రపతి సాహు మహారాజ్ అని కొనియాడారు. పాలకుడిగా మాత్రమే కాకుండా భారత సామాజిక చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించిన మహోన్నత నాయకుడిగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. 1902 జూన్ 26న కొల్హాపూర్ సంస్థానంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, దేశంలో రిజర్వేషన్ విధానానికి తొలి బాటలు వేసిన మహనీయుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. అణగారిన, వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగం, పాలనలో సమాన అవకాశాలు కల్పించడమే ఆయన లక్ష్యమని తెలిపారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య, హాస్టళ్లు, వసతి గృహాలు ఏర్పాటు చేయడంతో పాటు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. మహిళా విద్యాభివృద్ధికి కృషి చేయడంతో పాటు బాల్య వివాహాల నిర్మూలన, వితంతు పునర్వివాహాలకు ప్రోత్సాహం, అంటరానితనం నిర్మూలన వంటి అనేక



సామాజిక సంస్కరణలను అమలు చేశారని వివరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులను ప్రోత్సహించి సామాజిక మార్పు ఉద్యమాలకు అండగా నిలిచిన సాహు మహారాజ్, రాజు అంటే అధికారాన్ని అనుభవించే వ్యక్తి కాదని, ప్రజల సంక్షేమమే పాలనకు పరమావధి అని తన కార్యాచరణతో నిరూపించారని పేర్కొన్నారు. ఛత్రపతి సాహు మహారాజ్‌ను కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం చేయకుండా ఆయన అమలు చేసిన సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్యాభివృద్ధి, వెనుకబడిన వర్గాల సంక్షేమ విధానాలను నేటి పాలకులు ఆచరణలో పెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన మండల అధ్యక్షుడు గొడుగు నర్సిములు, ఫకీర్ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జహంగీర్ పాషా, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురభి విజయ్ కుమార్, సామాజికవేత్త గోనెల రాధాకృష్ణ, ఎంఆర్పీఎస్ నాయకుడు భీమ్ రాజ్, పట్టణ అధ్యక్షుడు శివరాములు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 28న,లట్టుపల్లి పి.హెచ్.సి లో పోలియో చుక్కల పంపిణీ

**నాగర్ కర్నూల్ : జూన్ 26 (ప్రజా జ్యోతి)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఈనెల 28న, ఆదివారం నాడు పోలియో చుక్కల కేంద్రాల ద్వారా పుట్టిన బిడ్డనుండే ఐదు సంవత్సరాల వరకు గల పిల్లలందరికీ రెండు చుక్కల పోలియోమందును ఉచితంగా వేస్తున్నట్లు లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ టి.ప్రసన్న శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మంగనూరు గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ నందు పోలియో చుక్కల కేంద్రం ఏర్పాటు చేశామని, అదేవిధంగా మంగనూరు గ్రామపంచాయతీ దగ్గర,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర, లట్టుపల్లి ఆరోగ్య ఉప కేంద్రం వద్ద,లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో,గౌరారం ఎర్రకుంట తండా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద,భీముని తాండ,చిన్న పేరు తాండ,గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద,గంగారంలో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పోలియో చుక్కల కేంద్రాలు ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు.మొబైల్ టీం ద్వారా అన్ని గిరిజన తండాలలో పోలిచికలు ఆరోగ్య సిబ్బంది వచ్చి ఉదయము 7 గంటల నుండి సాయంత్రం 6 గంటలలోపు అందరికి వేస్తారని ఆమె తెలిపారు.పెద్ద తాండ,వాసురం తండా,నక్కల చెరువు తండా, ఉడుగులకుంట తండా,బోర్సు గడ్డ తండా, ఎర్రకుంట తండా, కీమ్యాతాండా మరియు ఇతరతాండాలకు ఆరోగ్య సిబ్బంది ఆదివారం, సోమవారము,మంగళవారం నాడు వాహనం ఆశా కార్యకర్తలతో పాటు సిబ్బంది లో వచ్చి తప్పనిసరిగా అర్హులైన 5 సంవత్సరాల పిల్లల వారందరికీ ఉచితంగా పోలిచుక్కలు వేస్తారని ఆమె తెలిపారు.గ్రామ సర్పంచులు,నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు,స్వయం సంఘాల సభ్యులు,పిల్లల తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు సహకరించి పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించుకోవాలని ప్రయాణంలో ఉన్నప్పటికీ దగ్గరలోని పోలియో కేంద్రంలో పొలిచుక్కలువేయించాలన్నారు.వివరాలకు 9963583207లో సంప్రదించాలన్నారు.



# ఈనెల 28న,ఆదివారం పోలియో పంపిణీ

## -బిజినపల్లి వైద్యాధికారి డాక్టర్ పి.సృజన

**నాగర్ కర్నూల్ : జూన్ 26(ప్రజా జ్యోతి)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28న,ఆదివారం నాడు ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల వరకు ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు ఆదివారం నాడు ఏర్పాటుచేసిన పోలియో కేంద్రాల ద్వారా ఉచితంగా ఉ: 7:00 గంటల నుండి సా :6:00 గంటల వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బిజినపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో,బిజినపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర,ప్రాథమిక పాఠశాల గాంధీ నగర్,ప్రగతి స్కూల్ పోలీస్ స్టేషన్ పక్కన,శాయిన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర,మహాదేవుని పేట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, మమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో,వట్టెం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర,వెలుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర,పోలేపల్లి ప్రాథమిక పాఠశాల దగ్గర, మొబైల్ టీం ద్వారా బోయపూర్,ఆన్కాన్ పల్లి తండా,ఇతర తాండలు ఇటుక బట్టిలు,గుడిసెలలో పర్యవేక్షకులు,ఆశా కార్యకర్తలు,సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన వాహనంలో వచ్చి తప్పనిసరిగా అర్హులైన వారికి పోలియో చుక్కలు వేస్తారని ఆమె తెలిపారు. పుట్టిన బిడ్డ నుండి అయిదు సంవత్సరాలు వయసున్న వారందరూ తప్పనిసరిగా ఆదివారం నాడు పోలియో చుక్కల మందు ఉచితంగా వేయించుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు పర్యవేక్షకులు అశోక్ గారిని సెల్ లో 9490927816 కు సంప్రదించాలన్నారు.




# బీఆర్ఎస్‌కు షాక్...

## -తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిన నాయకులు
## -కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : జూన్ 26 (ప్రజా జ్యోతి)**

నాగర్‌కర్నూల్ మండలం పెద్ద ముద్దునూరు గ్రామంలో గురువారం మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ నాయకులను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది.గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తాము పొరపాటున బీఆర్ఎస్ పార్టీలో చేరామని తిరిగి సొంత గూడు కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు రావు,పార్టీ నాయకులు,ప్రతినిధులు,కార్యకర్తలు ఉన్నారు.

# ప్రజారోగ్యం కోసం శ్రమిస్తున్న పారిశుధ్ధ్య సిబ్బంది

**చిన్నంబావి, జూన్ 26 (ప్రజాజ్యోతి)**



వర్షాకాలంలో ప్రయాణికులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు చిన్నంబావి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో పారిశుధ్ధ్య సిబ్బంది ప్రత్యేక శుభ్రత కార్యక్రమం చేపట్టారు. బస్టాండ్ ఆవరణను పూర్తిగా శుభ్రపరిచి, లిక్విడ్‌తో కడిగి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.వర్షాల కారణంగా పేరుకుపోయే మురికి, దుర్వాసన, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పారిశుధ్ధ్య సిబ్బంది ఉదయం నుంచే శ్రమించి బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యం లేకుండా బస్టాండ్‌ను వినియోగించుకునేలా నిత్యం పారిశుధ్ధ్య పనులు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. బస్టాండ్‌కు వచ్చే ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రతను కాపాడడంలో సహకరించాలని పారిశుధ్ధ్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు. వానాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణ కోసం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్ధ్య బాలస్వామి, పెద్ద దేవన్న సిబ్బంది సేవలను స్థానికులు అభినందించారు.

# వెల్లటూరులో ఎస్ఐఆర్--2026 సర్వే

చిన్నంబావి, జూన్ 26 (ప్రజా జ్యోతి)



కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్--2026 (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమం చిన్నంబావి మండలంలోని వెల్లటూరు గ్రామంలో శుక్రవారం ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ బెక్కెం సుజాతమ్మ ప్రతాప్‌రెడ్డి తన వివరాలను నమోదు చేయించుకుని సర్వేకు శ్రీకారం చుట్టడంతో పాటు తొలి నమోదుదారుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “ప్రతి ఓటు విలువైనది.. ప్రతి ఓటరు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది” అని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, ఇప్పటికే జాబితాలో ఉన్నవారు తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని సూచించారు.ఓటరు జాబితాను మరింత కచ్చితంగా రూపొందించేందుకు చేపడుతున్న ఈ సర్వేలో గ్రామ ప్రజలందరూ చురుకుగా పాల్గొని, ఇంటింటికి వచ్చే బీఎల్‌వోలకు సరైన వివరాలు అందించాలని కోరారు. ఒకరికి ఒకే ఓటు ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా ప్రజాస్వామ్య ప్రక్రియకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో సుజాతతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.